బాల్యం బుగ్గిపాలు

రసాయన మందులు పిచికారి చేసే పంపుల రిపేరీ దుకాణంలో పని చేస్తున్న బాల కార్మికుడు

హోటళ్లు, ఖార్ఖానాలు, దుకాణాలలో బాల కార్మికులు

నిద్రావస్థలో లేబర్ అధికారులు

ప్రజాశక్తి - పత్తికొండ

ఉన్నత విద్యను అభ్యసించి భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో ఉండాల్సిన బాలలు. బాల కార్మికులుగా మారి కష్టాలతో నలిగిపోతున్న సంఘటనలు పత్తికొండలో కనబడుతున్నాయి. పత్తికొండ రెవెన్యూ డివిజన్ కేంద్రంలోని బడిలో ఉండాల్సిన బాలులు మెకానిక్, డాబాలు, కిరాణా షాప్‌లు, కూరగాయల మార్కెట్, టీస్టాల్ పలు రకాల వ్యాపార రంగ దుకాణాల్లో దాదాపు 50 మంది దాకా కనబడుతున్నారు. పత్తికొండ మండలం హోసూరు, పుచ్చకాయలమాడ, జూటూరు, మండగిరి, దూదకొండ, కనకదిన్నె, చందోలి, పందికోన తదితర గ్రామ పంచాయతీ లోని ప్రజలు ఉపాధి కోసం సుదూర ప్రాంతాలకు తరుచూ వలస వెళ్తుంటారు. అవ్వ తాతల దగ్గర బాలలను వదిలి వెళ్తుంటారు. బాలలు పట్టణానికి వచ్చి ఏదో ఒక దుకాణంలో పని చేస్తూ వచ్చిన డబ్బుతో కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నారు. నేటి బాలలే రేపటి పౌరులు అనే నినాదాన్ని లేబర్ అధికారులు పూర్తిగా మర్చిపోయి నిద్రావస్థలో విధులు నిర్వహిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. పట్టణ, గ్రామాలలో లేబర్ అధికారులు పర్యటించి బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి. బాలల చేత పనిచేయించకూడదని ప్రజలకు అవగాహన కల్పించాలి.

చట్టం ఏం చెబుతుంది

భారత ప్రభుత్వం 1986లో బాల కార్మికులు వ్యవస్థ నిర్మూల కోసం ప్రత్యేక చట్టం తీసుకొచ్చింది. 14 ఏళ్లలోపు పిల్లలు ఎవరు ఎక్కడా పనిచేయడానికి వీలు లేదు. 14 నుండి 18 ఏళ్ల వయసు గల వారిని ఎలాంటి ప్రమాదకరమైన ప్రదేశాలలో పని చేయించకూడదు. ఎవరైనా అతిక్రమిస్తే కఠిన శిక్షలు అనుభవించాల్సి ఉంటుంది. పత్తికొండ ప్రాంత ప్రజలు వ్యవసాయ పనులపై జీవనాధారం చేస్తూ జీవనం సాగిస్తారు. సకాలంలో వర్షాలు రాక వేసిన పంటలు చేతికి రాకపోవడంతో చేసిన అప్పులు తీరక అనేకమంది రైతులు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. అప్పులు తీరాలంటే ఉన్న ప్రాంతాన్ని వదిలి సుదూర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిందే. విద్యార్థులు చదువును మధ్యలోనే ఆపేసి వలస బాట పడుతున్నారు. ప్రతి ఏటా సుమారు వందల మంది విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు. ఆర్థిక స్థోమత కోసం బాలులను పనికి పంపిస్తున్నారు. ఇలాగే కొనసాగితే పత్తికొండలో అక్షరాస్యత పూర్తిగా తగ్గిపోతుందని పలువురు మేధావులు పేర్కొంటున్నారు.

విద్యార్థులు దుకాణాల్లో పని చేయడం బాధాకరం

తల్లిదండ్రులు ఉపాధి కోసం సుదూర ప్రాంతాలకు వలసవెళ్లడంతో విద్యార్థులు చదువును మధ్యలోనే మానేస్తున్నారు. విద్యార్థులు దుకాణాల్లో పనిచేయడం చాలా బాధాకరం. విద్యార్థులకు సీజనల్ హాస్టళ్లలో చేర్పించి విద్యను ప్రోత్సహించాలి.

- చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి, సిఐటియు నాయకుడు.

దుకాణ యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటాం

దుకాణాలలో బాల కార్మికుల చేత పనిచేయిస్తే అట్టివారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. బాలల తల్లిదండ్రులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. బాలలను బడిలో చేర్చాలని ఉన్నత చదువును చదివించాలని చెబుతున్నాం. ఎవరైనా బాలల చేత పని చేయించినట్లు రుజువైతే చట్టం ప్రకారం శిక్షార్హులవుతారు.

- సహాయ కార్మిక అధికారి లక్ష్మి.

కార్మిక, రైతు సంఘాల బైక్ ర్యాలీ

- 26 కలెక్టరేట్ ఎదుట మహా ధర్నా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టర్

ఈనెల 26న కలెక్టరేట్ ఎదుట చేపట్టే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం కలెక్టరేట్ నుండి కార్మిక రైతు సంఘాలు బైక్ ర్యాలీ ప్రదర్శనను నిర్వహించారు. ఈ ర్యాలీని సిఐటియు,ఎఐటియుసిల జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎండి అంజిబాబు, ఎస్.మునెప్ప , ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ జెండా ఊపి ప్రారంభించారు స్కూటర్ ర్యాలీ పెద్ద పార్కు, పాత బస్టాండ్, స్టేట్ బ్యాంక్, ఆర్ఎస్ రోడ్డు, కొత్త బస్టాండు, బళ్లారిచౌరస్తా వరకు స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రైతు ఉద్యమం సందర్భంగా వ్యవసాయ నల్ల చట్టాలను వెనక్కు తీసుకుంటామని, రైతులు పండించిన పంటకు కనీసం మద్దతు ధర చట్టాన్ని తీసుకొస్తామని ఇచ్చిన హామీని గాలికి వదిలేసారన్నారు. బ్రిటిష్ పాలలోనే అనేక పోరాటాలు చేసి కార్మికుల సాధించుకున్నటువంటి 44 కార్మిక చట్టాలను మార్చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చి కార్మిక హక్కులను కాలరాస్తున్నారన్నారు. ఈ లేబర్ కోడ్ లు వల్ల దేశంలోని కార్మిక వర్గం ఎనిమిది గంటల పని విధానం, సమ్మెహక్కు, ఉద్యోగ భద్రత హక్కును కోల్పోయే పరిస్థితి వచ్చిందన్నారు. కార్మికులు యజమానులకు బానిసలయ్యేలా పరిస్థితులు నెలకొల్పుతున్నారన్నారు. ప్రైవేటీకరణ పేరుతో దేశ సంపద అయిన ప్రభుత్వ రంగ సంస్థలను ఆదాని, అంబానీలకు కట్టబెడుతున్నారన్నారు. ఈ నెల 26న 10 కేంద్ర కార్మిక సంఘాలు 500 రైతు కిసాన్ సంయుక్త మోర్చా సంఘాలు తలపెట్టిన మహా ప్రదర్శన ధర్నా కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు రైతులను కోరారు. సిఐటియు నగర నాయకులు నరసింహులు రాముడు సాయిబాబా సుధాకరప్ప, ఎఐటియుసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న సిఐటియు, ఎఐటియుసి, ఎపి రైతు సంఘం నాయకులు

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధిస్తాం

- వర్చువల్‌గా విద్యార్థులకు బోధన
- విద్యార్థులకు పౌష్టికాహారం అందజేత
- ఆపార్ నమోదులో ఇబ్బంది లేకుండా చర్యలు

-ప్రజాశక్తితో డిఇఒ ఎస్.శామ్యూల్ పాల్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

'ప్రస్తుత విద్యా సంవత్సరంలో టెన్త్‌లో ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తున్నాం. రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా కర్నూలు జిల్లాలోని వర్చువల్ తరగతుల ద్వారా విద్యార్థులకు బోధన అందించేందుకు అడుగులు వేస్తున్నాం. ఈ వర్చువల్ తరగతులను త్వరలోనే విద్యాశాఖ మంత్రి చేత ప్రారంభించేందుకు జిల్లా కలెక్టర్ సన్నద్ధమయ్యారు. మధ్యాహ్న భోజన పథకం కింద విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందజేస్తున్నాం.' అని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ శామ్యూల్ పాల్ తెలిపారు. డిఇఒగా ఇటీవలనే బాధ్యతలు చేపట్టిన ఆయన జిల్లా విద్యాశాఖలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుడుతున్నామని ప్రజాశక్తి ముఖాముఖిలో వెల్లడించారు.

జిల్లాలో ప్రస్తుత విద్యా సంవత్సరం టెన్త్ పరీక్షల ఉత్తమ ఫలితాల సాధనకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? సిలబస్ ఎంతవరకు పూర్తి అయ్యింది.?

డిఇఒ : టెన్త్ విద్యార్థులకు సంబంధించిన సిలబస్ డిసెంబర్ కల్లా పూర్తి అవుతుంది. డిసెంబర్ జనవరి మాసాల్లో రివిజన్ టెస్టు నిర్వహించి ఫిబ్రవరిలో ప్రీ ఫైనల్ పరీక్షలను నిర్వహిస్తాం. టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులను కూడా ఉదయం సాయంత్రం గంటపాటు అదనంగా తీసుకుంటున్నాం. విద్యార్థులను ఎబిసిడి కేటగిరీలుగా విభజించాం. ఎబి కేటగిరీకి చెందిన విద్యార్థులకు 100శాతం మార్కులు సాధించేలా శిక్షణ ఇస్తున్నాం. మిగిలిన రెండు కేటగిరీలకు చెందిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. విద్యార్థుల తల్లిదండ్రుల మొబైల్ నెంబర్లను తీసుకొని ప్రత్యేక వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు సమాచారం అందిస్తున్నాం. పాఠశాలలను మండల స్థాయి అధికారులంతా ఒక్కో పాఠశాల బాధ్యత తీసుకొని పర్యవేక్షణ చేసి ఎప్పటికప్పుడు నివేదిక అందించాల్సి ఉంటుంది.

డిఇఒ కార్యాలయంలో వర్చువల్ స్టూడియోను ఏర్పాటు చేశారు? ఎప్పుడు దీనిని ప్రారంభిస్తారు?

డిఇఒ: జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు వర్చువల్ తరగతులను నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ నిర్ణయం తీసుకున్నారు. విద్యార్థులకు నిష్ణాతులైన ఉపాధ్యాయ బృందం ద్వారా సబ్జెక్టులపై ప్రత్యేక తరగతులను నిర్వహిస్తాం. విద్యార్థులు కూడా వర్చువల్‌గా అక్కడి నుండే ఏమైనా సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ద్వారా వర్చువల్ తరగతులను ప్రారంభించేందుకు జిల్లా కలెక్టర్ ప్రయత్నం చేస్తున్నారు. త్వరలోనే విద్యార్థులకు వర్చువల్ శిక్షణ తరగతులను మొదలు పెడుతాం.

మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు ఎలా ఉంది? విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నారా?.

డిఇఒ: మధ్యాహ్న భోజన పథకం కింద విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నాం. ఇటీవల జిల్లా స్థాయి నుండి మధ్యాహ్న భోజన పథకం మెనూలో మార్పులకు రాష్ట్రస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం. అక్కడ కూడా విద్యార్థులకు ఆయా ప్రాంతాల వారీగా ఆహారాన్ని తయారుచేసి అందివ్వాలని విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. రాయలసీమ ప్రాంత విద్యార్థులకు ఇక్కడ ఉన్న వాతావరణానికి అనుగుణంగా ఆహారాన్ని అందించేందుకు త్వరలోనే మెనూలో మార్పులు కూడా చేసే అవకాశం ఉంది.

ఇటీవల కాలంలో విద్యార్థులకు అపార్ నమోదులో అనే క అవస్థలు పడుతున్నారు? జనన ధృవీకరణ పత్రాల కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై మీ స్పందన ఏమిటి?

డిఇఒ: జిల్లాలో మొత్తం 4.63 లక్షల మంది విద్యార్థులను ఆపార్‌లో నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే దాదాపుగా 3.89 లక్షల మంది విద్యార్థులను నమోదు చేస్తున్నాం. విద్యార్థులు జనన ధ్రువీకరణ పత్రాల కోసం కార్యాలయం చుట్టూ వెళ్లాల్సిన అవసరం లేకుండా రెవెన్యూ అధికారుల బృందమే నేరుగా పాఠశాలలను సందర్శించి అక్కడే విద్యార్థులకు కావలసిన జనన ధ్రువీకరణ పత్రాల జారీకి చర్యలు తీసుకుంటున్నాం.

జిల్లాల విద్యాశాఖ ద్వారా ఎలాంటి పనులను చేపడుతున్నారు

డిఇఒ: పిఎం శ్రీ పథకం కింద జిల్లాలో 52 పాఠశాలలను ఎంపిక చేశారు. రెండు విడతలుగా జరుగుతున్న ఈ కార్యక్రమం కింద పాఠశాలల్లో విద్యార్థులకు లాబరేటరీలతో పాటు మైదానాల సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. సాల్ట్, ఎఫ్ఎల్ఎం కార్యక్రమాల కింద హెచ్ఎంలు, ఉపాధ్యాయులకు శిక్షణ కార్య క్రమాలను కూడా ఇస్తున్నాం. పాఠశాలలకు ఎస్ఎంసి గ్రాంట్లు ఎంఆర్‌సి గ్రాంట్ కూడా ఇటీవలనే విడుదల చేసాం. 34 సీజనల్ హాస్టళ్లను కూడా త్వరలోనే ఏర్పాటు చేయనున్నాం. ఇటీవల కాలంలో కెజిబివిలో 51 మంది టీచింగ్ , 49 మంది నాన్ టీచింగ్ సిబ్బంది నియామకాలు కూడా పారదర్శకంగా చేపడుతున్నాం.

ముఖాముఖి

ఫీజుల కోసం వేధిస్తే చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఫీజులు చెల్లించలేదనే కారణంతో డిగ్రీ, ఇంటర్ విద్యార్థులకు హాల్ టిక్కెట్లు నిరాకరించడం, తరగతులకు హాజరు కాకుండా చేస్తే కళాశాల యాజమాన్యాలపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఒక ప్రకటనలో హెచ్చరించారు. విద్యార్థులపై ఒత్తిడి తీసుకువచ్చే చర్యలు చేపడితే సహించబోమన్నారు. ఫీజు రీఇంబర్స్‌మెంట్ నిధులను రాష్ట్ర ప్రభుత్వం నేరుగా కళాశాలల బ్యాంకు ఖాతాలకే జమ చేస్తుందన్నారు. విద్యార్థులను ఇబ్బంది పెట్టవద్దని, చదువుకు ఆటంకం కలిగించే ఎలాంటి చర్యలు చేపట్టకూడదన్నారు.

వ్యాపారులకు సూచనలు చేస్తున్న మార్కెట్ యార్డు కార్యదర్శి జయలక్ష్మి

కూరగాయల మార్కెట్‌ను పరిశీలించిన కార్యదర్శి

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

కర్నూలు వ్యవసాయ మార్కెట్ లోని కూరగాయల మార్కెట్‌లో మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి ఆర్. జయలక్ష్మి ఆదివారం పర్యటించారు. కూరగాయల మార్కెట్‌లో ఉండే సమస్యలను రైతులను, వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్‌లో ట్రాఫిక్ అంతరాయం ఎక్కువ ఉందని తద్వారా రైతులకు, కొనుగోలు దారులకు తీవ్ర సమస్యగా ఉండడం వల్ల ట్రాఫిక్ అంతరాయం రాకుండా తగు సూచనలు సలహాలు చేసి తగు చర్యలను తీసుకునేలా సిబ్బందిని ఆదేశించారు. మార్కెట్‌లో పేరుకుపోయిన చెత్తను, వ్యర్థాలను ఎప్పటికిప్పుడు తొలగించాలని , కూరగాయల మార్కెట్‌ను ప్రతిరోజు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని క్లీనింగ్ కాంట్రాక్టర్‌కు సూచించారు. కూరగాయల అమ్మే వ్యాపారులు తమవద్ద చెత్తబుట్టలను పెట్టుకొని అందులోనే చెత్తను వేయాలని తెలిపారు. మార్కెట్‌ను పరిశుభ్రంగా ఉంచాలని, అందుకు తగిన చర్యలు చేపట్టామన్నారు. ఆమెవెంట సూపర్ వైజర్ కేశవరెడ్డి,సెక్యూరిటీ సిబ్బంది మద్దిలేటి ,కిరణ్,తదితరులు పాల్గొన్నారు.

భర్తను చంపిన భార్య

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కుటుంబ కలహాల నేపథ్యంలో ఆవేశానికి లోనైన భార్య భర్తను చంపిన ఘటన ఆదివారం వెలుగు చూసింది. అందుకు సంబంధించిన వివరాలను కర్నూలు తాలూకా సిఐ శ్రీధర్ మీడియాకు వెల్లడించారు. సిఐ కథనం మేరకు... కర్నూలు నగరం శివారులోని టివి-9 కాలనీ ప్రజానగర్‌కు చెందిన కరగల్ల చిన్న(25) తన భార్య స్వరూపారాణి కుటుంబ సమస్యల నేపథ్యంలో పరస్పరం గొడవపడుతున్నారు. ఆదివారం ఇదే నేపథ్యంలో వారి మధ్య మొదలైన వివాదం చిలికి చిలికి గాలివానలా మారింది. మద్యాహ్నం ఆగ్రహించిన భార్య ఇంట్లో ఉన్న ఇనుపరాడ్డుతో ఒక్కసారిగా భర్త తలపై మోగింది. భర్త చిన్నతలకు బలమైన గాయం కావడంతో తల నుండి విపరీతమైన రక్తస్రావం అయి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మృతుని తల్లి కరగళ్ల పద్మావతి కర్నూలు తాలూకా పోలీసులను ఆశ్రయించి మృతుని భార్య స్వరూప రాణి పై ఫిర్యాదు చేశారు. పోలీసులు క్రైమ్ నెంబర్ 427/2024 బిఎన్ఎస్ సెక్షన్ 103 కింద కేసు నమోదు చేసుకొని నిందితురాలు స్వరూపరాణిని అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు.

అందరూ సమన్వయంతో పనిచేయాలి

కోర్టు కానిస్టేబుళ్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో అడిషనల్ ఎస్‌పి జి. హుస్సేన్ పీరా

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కేసుల పరిష్కారంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పోలీసులు అందరూ కలిసికట్టుగా సమన్వయంతో పనిచేయాలని జిల్లా అడిషనల్ ఎస్‌పి హుస్సేన్ పీరా అన్నారు. జిల్లా ఎస్‌పి జి. బిందు మాధవ్ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, జిల్లా కోర్టు కానిస్టేబుళ్లతో అడిషనల్ ఎస్‌పి జి.హుస్సేన్‌పీరా సమావేశం నిర్వహించారు. అడిషనల్ ఎస్‌పి మాట్లాడుతూ..డిసెంబర్ 14న జరిగే లోక్‌అదాలత్‌లో అందరూ సమన్వయంతో బాగా పని చేయాలన్నారు. వీలైనంత వరకు ఎక్కువ కేసులు పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. అధిక సంఖ్యలో కేసులు రాజీకుదిరేలా న్యాయశాఖ, పోలీసుశాఖలు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఏదైనా కేసులలో నిందితులను అరెస్టు చేసేటప్పుడు సుప్రీంకోర్టు, హైకోర్టులనియమ, నిబంధనలు విధి, విధానాలు పాటించాలన్నారు. సిఐలు ప్రసాద్, రామయ్యానాయుడు, పిపిలు , కోర్టు కానిస్టేబుళ్ల పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అడిషనల్ ఎస్‌పి జి. హుస్సేన్ పీరా

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల అధ్యక్షులు ఆంజనేయులు వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గోపాల్ డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర కోరారు. నవంబర్ 26న నిర్వహించే ర్యాలీలను సభలను జయప్రదం చేయాలని దేవమాడ, దొడ్డిపాడు, పూలతోట, ఇందిరమ్మ కాలనీ, గొందిపర్ల ఈ తాండ్రపాడు పంచలింగాల గ్రామాలలో కరపత్రాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి మూడోసారి అధికారంలోకి వచ్చాక కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేసే విధంగా ఉందని అన్నారు. సంపద సృష్టించే కార్మికులు దేశానికి తిండి పెట్టే రైతాంగం ఇబ్బందుల్లో ఉన్నారని తెలిపారు. దేశంలో బిజెపి ప్రభుత్వం వారిని పట్టించుకోవడం లేదని అన్నారు. బిజెపి గత పది ఏళ్లలో కార్పొరేట్లకు రూ.19.28 లక్షల కోట్లు రుణమాఫీ, పన్ను రాయితీ ప్రోత్సాహాల పేరుతో ప్రజాధరాన్ని దోచిపెట్టిందని విమర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ తో సహా భారీ పరిశ్రమలు గనులు సముద్ర తీరాన్ని కారు చౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతుందని అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా నవంబర్ 26న దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జరిగే కార్యక్రమాల్లో రైతులు కార్మికులు వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు శ్రీనివాసరెడ్డి, మునిస్వామి, మద్దిలేటి గ్రామాల రైతులు పాల్గొన్నారు

కరపత్రాలు విడుదల చేస్తున్న రాఘవేంద్ర, ఆంజనేయులు, రైతులు

బలిజల ఐక్యత అవసరం

అడ్వకేట్ రామచంద్రరావు, పత్తిఓబులయ్య

ఆహ్లాదకర వాతావరణం వజభోజనం, రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -కర్నూలు అగ్రికల్చర్ : బలిక కులస్తులలో ఐక్యత లేక అనేకం కోల్పోయామని, ఐక్యంగా కదిలితే రాజ్యాధికారం సొంత మవుతుందని ఆకుల ప్రముఖులు అడ్వకేట్ రామచంద్రరావు, నంది అవార్డు గ్రహీత పత్తిఓబులయ్య అన్నారు. కర్నూలు నగర బలిజ సంఘం ఆధ్వర్యంలో ఆహ్లాదకర వాతావరణంలో, ఆటపాటలతో వైభవంగా వనభోజన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ వెనక ఉన్న విజ్ఞాన పీఠంలో కర్నూలు ఉమ్మడి జిల్లాలో ఉన్న బలిజ సంఘ ప్రముఖులు, బలిజ కులస్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. బలిజ కుల ప్రముఖులు అడ్వకేట్ రామచంద్రరావు, పత్తి ఓబులయ్యలు మాట్లాడుతూ బలిజ కులస్తులు ఐక్యంగా కావడం సంతోషంగా ఉందన్నారు. ఇదే ఐక్యతను ఇలాగే కొనసాగిస్తే రాజ్యాధికారం దానంతట అదే మన దగ్గరికి వస్తుందని , బలిజ కులస్తుల్లో గతంలో ఐక్యత లేకపోవడం వల్లే, రాజకీయ పదవులకు, ప్రాధాన్యత కలిగిన ఉద్యోగాలలో ప్రాతినిధ్యం కోల్పోయామని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి కార్యక్రమాలు ద్వారా ఒకరి గురించి ఒకరికి తెలిసి, ఒకరికి ఇంకొకరు సహాయ సహకారాలు అందించే అవకాశం ఉందన్నారు. ఉన్నత స్థానాల్లో ఉన్నటువంటి వారు సాటి కులస్తులు ఏ అవసరార్థం వచ్చినా సహాయ సహకారాలు అందించేందుకు ముందుకు రావాలని కోరారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. బ్లడ్ డొనేషన్ క్యాంపుకు మంచి స్పందన లభించింది. బలిజ సంఘం అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మన్న, రవిలతోపాటు నాయకులు ఆర్జారామకృష్ణ, డాక్టర్ వై.సత్యనారాయణ, డాక్టర్ కుల్లాయప్ప, చింతపల్లి రామకృష్ణ కోనేటి వెంకటేశ్వర్లు, రాజారామ్, శ్రీకాంత్, శైలేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అడ్వకేట్ సత్యనారాయణ , వేదికపై పత్తిఓబులయ్య

జబర్దస్త్ కళాకారుల హాస్యవల్లరిని ప్రారంభిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

హాస్యం టానిక్ వంటిది

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

హాస్యం అందరికీ ఆరోగ్యాన్నిస్తుందని, అది టానిక్‌లా ఉపయోగపడుతుందని కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు తెలిపారు. ఆదివారం రాత్రి స్థానిక టిజివి కళాక్షేత్రంలో జబర్దస్త్ కళాకారుల హాస్యవల్లరి జరిగింది. ముఖ్య అతిథులు కమిషనర్ రవీంద్రబాబు, ఎస్ఇ రాజశేఖర్ హాస్య కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుంచి టిజివి కళాక్షేత్రంలో ఎన్నో గొప్ప సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. కళ వినోదంతో పాటు విజ్ఞానం అందిస్తుందన్నారు. కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య స్వాగతం పలుకుతూ కార్తీక మాసం చివరి ఆదివారం కర్నూలు నగర ప్రజల వినోదం కోసం జబర్దస్త్ ఏర్పాటు చేశామన్నారు. అంతకుముందు మున్సిపల్ అధికారులు జ్యోతి ప్రజ్వలన చేసి జబర్దస్త్ కళాకారులను సత్కరించారు. అనంతరం కళాకారుల కామెడీ స్కిట్స్‌తో ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించారు. ఇందులో జబర్దస్త్ అప్పారావు, జబర్దస్త్ వినోదిని, గుండు మురళి, అల్లరి అర్జున్, నవీన్, ఎస్ఆర్ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు. భారీ ఎత్తున ప్రజలు హాజరయ్యారు. కళాక్షేత్రం కార్యవర్గ సభ్యులు ఇనయతుల్లా, లక్ష్మీకాంతరావు, వాల్మీకి రాముడు, బాల వెంకటశ్వర్లు, శ్రీనివాస్ రెడ్డి, క్రిస్టఫర్, యాగంటి ఈశ్వరప్ప, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగరంలోని వీకర్‌సెక్షన్ కాలనీ, కొత్త బస్టాండ్ వెనుక ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆదివారం నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు పరిశీలించారు. అలాగే ఓ పార్కు స్థలంలో ప్రైవేటు వ్యక్తులు కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో వాటికి తాళం వేయించారు. కార్యక్రమంలో ప్రజారోగ్యధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర్‌రెడ్డి, పారిశుధ్య తనిఖీదారుడు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రగౌడ్‌కు చేజారిన ఆలూరుఇన్‌ఛార్జి పదవి ?!

- వైకుంఠ జ్యోతికి నాయకత్వ బాధ్యతలు
-విశ్వసనీయ సమాచారంతో సంబరాలు

ప్రజాశక్తి-ఆస్పరి

ఆలూరు నియోజక వర్గం టిడిపి ఇన్చార్జి మార్పుపై పార్టీలో కొన సాగుతున్న ఉత్కంఠకు అధిష్టానం తెరదించి నట్లు తెలిసింది. వీరభద్ర గౌడ్ స్థానంలో కొత్త ఇన్చార్జిగా వైకుంఠం జ్యోతిని ఎంపిక చేసినట్టు సమాచారం. వీరభద్రగౌడ్ నియోజవర్గంలో టిడిపి శ్రేణులను కలుపుకుపోవడం లేదని పలుమార్లు టిడిపి సీనియర్ నాయకులు, మండల కన్వీనర్లు అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు.అధిష్టానం కూడా జోక్యం చేసుకొని ఈ విషయంపై చర్చలు జరిపింది. టిడిపి జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి నియోజవర్గ నాయకులతో సమావేశం నిర్వహించారు.ఈ విషయంపై రెండుసార్లు గౌడువర్గం, ఆయన వ్యతిరేక వర్గాలు కర్నూలు జిల్లా కేంద్రానికి వచ్చిన రాష్ట్ర నాయకుల దృష్టికి తీసుకెళ్లేందుకు బల ప్రదర్శన కూడా చేశారు. నియోజకవర్గంలో అందరిని కలుపుకొని వెళ్లాలని అధిష్టానం వీరభద్రగౌడ్‌కు సూచించినప్పటికీ పట్టించుకోవడం లేదని అసంతృప్తి,నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వైకుంఠం జ్యోతికి ఇంచార్జ్ పదవి ఇచ్చినట్టు టిడిపి అధిష్టానం నుంచి సంకేతాలు వచ్చాయని వైకుంఠం జ్యోతి ఆమె వర్గీయులు నియోజకవర్గంలోని పలుచోట్ల బాన సంచాలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. కెడిసిసి బ్యాంక్ మాజీ చైర్మన్ వైకుంఠం శ్రీరాములుకు నియోజకవర్గంలో బలమైన వర్గం ఉంది. ఆయన కుమారుడు వైకుంఠం శివప్రసాద్ కూడా మొదటి నుంచి టిడిపి పార్టీలో కొనసాగుతూ పార్టీ అభివృద్ధికి ఎంతగానో కషి చేశారు. ఆయన కూడా గతంలో టిడిపి



వైకుంట జ్యోతి

ఇన్చార్జిగా కొనసాగారు. గత అసెంబ్లీ ఎన్నికలలో గౌడ్ గెలుపుకు తన వంతు కృషి చేసినప్పటికీ ఆయన స్వయం కృతాపరాదం వల్లే ఓడినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. వైకుంఠం శివప్రసాద్ సతీమణి జ్యోతికి ఆలూరు నియోజకవర్గ ఇంచార్జ్ పదవి రావడంతో నైనా ఆలూరులో టిడిపికి పూర్వ వైభవం వస్తుందో లేదో వేచి చూడాలి.

అక్రమాలపై ఆదోని ఎమ్మెల్యే స్పందించాలి

- మైనార్టీ హక్కుల పరి రక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహమ్మద్

ఫొటో మాట్లాడిన నూర్ హమ్మద్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలో యదేచ్ఛగా కొనసాగుతున్న గరుసు మట్టి మాఫియాపై ఎమ్మెల్యే పార్థసారథి స్పందించి సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట కార్యదర్శి నూర్ అహమ్మద్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కూటమిలోని కొందరు నాయకులు చేస్తున్న అక్రమ మట్టి దందాలను వ్యతిరేకిస్తున్నామన్నారు. మైనింగ్ గడువు ముగిసి 20 రోజులు గడిచినా యధేచ్ఛగా తవ్వకాలు కొనసాగిస్తూ ఉండటం చూస్తుంటే ఈ మట్టి మాఫియాకు ప్రభుత్వం, చట్టాలు లెక్క లేనట్టుందన్నారు. అవినీతిని సహించనని ఎల్లప్పుడూ పలికే ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి ఈ మట్టి మాఫియాపై కేసులు నమోదు చేసి, వారు వాడిన లారీలు, ప్రొక్లైన్లు, ఇతర వాహనాలు స్వాధీనం చేసుకుని నిజాయితీ నిరూపించు కోవాలన్నారు. లేనిపక్షంలో మట్టి మాఫియాకు ఎమ్మెల్యే సంపూర్ణమైన భరోసా ఇస్తున్నట్లు భావించాల్సి వస్తుందన్నారు. ఇప్పటికే ఇచ్చిన

పర్మిషన్ కంటే ఎన్నో రెట్లు ఎక్కువ తవ్వి పర్యావరణానికి హాని కలిగించారనే సమాచారం ఉందన్నారు. కూటమి ప్రభుత్వానికి తలవంపులు తెచ్చే విధంగా ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి వ్యవహరిస్తే ఖచ్చితంగా ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

కనీస వేతన చట్టం అమలు చేయాలి

- 26న చలో కలెక్టరేట్ జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి -ఎమ్మిగనూరు

వివిధ రంగాల్లో పనిచేస్తున్న కాంటాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులకు కనీసం వేతనం అమలు చేయాలని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికుల పట్ల అనుసరిస్తున్న వైఖరిని విడనాడాలని సిఐటియు మండల కార్యదర్శి బి.రాముడు అన్నారు. ఆదివారం సిఐటియు ఆధ్వర్యంలో కార్మికుల నిర్బంధాలను నిరసిస్తూ, కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా ఈనెల 26 కలెక్టరేట్ ముందు నిర్వహించు ధర్నాకు అన్ని రంగాల కార్మికులు హాజరు కావాలని కోరారు. కనీస వేతన చట్టం ప్రకారం రూ.26,000 ఇవ్వాలని, పిఎఫ్ ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆటో కార్మికులపై నిర్బంధాలు విడనాడాలని, కొత్త చట్టాలను రద్దు చేయాలన్నారు. పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని తదితర డిమాండ్లతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆటో యూనియన్ నాయకులు గోపాల్, మధు, కొండారెడ్డి, సోమ నాయుడు, షబ్బీర్, రాజు, ఆమోస్, నరసన్న, ఆది, ఈరన్న, గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పరి : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాలపై పోరాటాలకు ప్రజల సిద్ధం కావాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బాలకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం ఎఐటియుసి కార్యాలయంలో ఆసంఘం మండల కార్యదర్శి కృష్ణమూర్తి అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఎమ్మిగనూరులో కరపత్రాలు విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు

వారు మాట్లాడుతూ ఈ నెల 26 న దేశవ్యాప్తంగా అఖిలపక్ష కార్మిక,సంయుక్త కిసాన్ మోర్చా సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చారని, సర్వసంపదలు సృష్టించేది కార్మికులని, దేశానికి తిండి పెట్టేది అన్నదాతలు కానీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లకు, పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తున్నాయని మండిపడ్డారు. ఎపిరైతు సంఘం జిల్లా నాయకులు బ్రహ్మయ్య, సిఐటియు మండల కార్యదర్శి రామాంజనేయులు,రైతు సంఘం మండల అధ్యక్షుడు బడేసాబ్, హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు హనుమంతు, నాయకులు శేఖర్, శీను, రంగన్నలు పాల్గొన్నారు.

సిబ్బంది విధులకు డుమ్మా కొట్టినా పట్టని అధికారులు

ప్రజాశక్తి-మద్దికేర

విధులకు సక్రమంగా హాజరై ప్రజలకు సులువైన సేవలు అందించాల్సిన వెలుగు ఎపిఎం రామాంజనేయులు తరచూ విధులకు డుమ్మా కొట్టినట్లు సిఐటియు మండల కార్యదర్శి బురుజుల రాముడు తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని నెలల క్రితం ఐకెపి ఎపిఎంగా రామాంజనేయులు మద్దికేరకు బదిలీ అయ్యారు. బదిలీ అయినప్పటి నుంచి విధులకు అయిష్టంగా పనిచేస్తున్నారన్నారు. విధులకు హాజరు కాలేనప్పుడు జిల్లా కేంద్రంలో సభలు సమావేశాలు ఉన్నాయని విధులకు డుమ్మా కొట్టడం ఎంతవరకు సబమని బురుజుల రాముడు ప్రశ్నించారు. పొదుపు మహిళల అభివృద్ధి కోసం,పథకాల అవగాహన కోసం నియమించిన సిబ్బంది విధులు పట్ల నిర్లక్ష్యం వల్ల పొదుపు మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. విధులకు సక్రమంగా రాలేకపోవడంతో ఆయన బాటలోనే వెలుగు సిసిలు ఇతర సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్నారని అన్నారు. దీంతో వెలుగు లక్ష్యం నెరవేరేదెలా అని అన్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని మీడియా సమక్షంలో కోరారు. ఎపిఎం రామాంజనేయులును వివరణ కోరగా ఆఫీసు పనికొరకే కర్నూలుకు వెళ్లినట్లు తెలిపారు.

కురువలకు స్థానిక పదవుల్లో ప్రాధాన్యత

-కనకదాసు విగ్రహం,కళ్యాణమండపానికి నిధులిస్తాం
-మంత్రి, ఎంపి, ఎమ్మెల్యేల హామీ

ప్రజాశక్తి -ఎమ్మిగనూరు

కురువలకు స్థానిక సంస్థల పదవుల్లో తగిన ప్రాధాన్యత, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ పదవి ఇస్తామని, కనకదాసు విగ్రహం ఏర్పాటు, కళ్యాణమండపానికి నిధులిస్తామని హ్యాండ్లూమ్స్,చేనేత మంత్రి ఎస్.సవిత, కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు, హిందూపూర్ ఎంపీ బికె.పార్థసారధి, బి. జనాగేశ్వర్ రెడ్డి హామీ ఇచ్చారు. కురువలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎదగాలని సూచించారు. ఆదివారం పట్టణంలోని వీవర్స్ కాలనీ గ్లోబల్ ఇండస్ పాఠశాల ఆవరణలో శ్రీభక్త కనకదాసు జయంతిని పురస్కరించుకొని కార్తీక మాసవనభోజన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా శివ సర్కిల్ నుంచి బైక్ ర్యాలీగా గ్లోబల్ స్కూల్ మైదానంకు చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి, ఎంపిలు, ఎమ్మెల్యే మాట్లాడుతూ కురువలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని కోరారు. టిడిపి ప్రభుత్వం కురువల ఎదుగుదలకు మొదటి నుండి ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. కురువలకు కళ్యాణ మండపం, శ్రీ భక్త కనకదాసు విగ్రహాలను ఏర్పాటుకు కృషి చేస్తామని, స్థానిక స్థానిక సంస్థ ఎన్నికలలో ప్రాధాన్యత , ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవికచ్చితంగా ఇస్తామని ప్రకటించారు. కురువ సంఘం నాయకుడు



ఎమ్మిగనూరు సభలో మాట్లాడుతున్న మంత్రి సవిత

కె.మద్దిలేటి మాట్లాడుతూ ఎమ్మిగనూరులో కురువలకు కళ్యాణ మండపం, శ్రీ భక్త కనకదాస విగ్రహం ఇస్లాం ఏర్పాటు చేస్తామని చెప్పిన మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలకు ధన్యవాదాలు తెలిపారు. కురవ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, డైరెక్టర్ గాజులదిన్నె రామకృష్ణ, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బత్తిన వెంకట రాముడు, కురువ సంఘం నాయకులు కె.మద్దిలేటి, పెద్ద మర్రి వీడు మల్లయ్య, తిమ్మాపురం వెంకటేష్, అయ్యలప్ప , బనవాసి నరసింహులు, చెన్నపురం నాగరాజు, బీరప్ప, కల్లుదేవకుంట రామ్ మనోహర్, హనుమంతు, నియోజకవర్గం కురువ సంఘం నాయకులు, నియోజకవర్గ టిడిపి నాయకులు, కురువ కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సిసి

ప్రజాశక్తి-ఆదోని

ఎన్‌సిసిలో చేరిన విద్యార్థులు క్రమశిక్షణకు మారుపేరుగా ఉంటారని నెహ్రూ స్మారక పురపాలక ఉన్నత పాఠశాల ఎన్‌సిసి అధికారి అనిల్ కుమార్ తెలిపారు. ఆదివారం హైస్కూల్లో 76వ ఎన్‌సిసి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారి అనిల్ కుమార్ మాట్లాడుతూ ఎన్‌సిసి జీవితంలో క్రమశిక్షణ నేర్పిస్తుందన్నారు. సమాజంలో ఎట్లా నడుచుకోవాలా విషయాన్ని నేర్పిస్తుందన్నారు. ఎన్‌సిసి వల్ల విద్యార్థులు క్రమశిక్షణ , దేశం పట్ల గౌరవాన్ని నేర్చుకుంటారన్నారు. ఎన్‌సిసి విద్యార్థులు నేషన్ ఫస్ట్ అనే నినాదంతో ముందుకు వెళ్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి కడేట్స్ బాయ్స్ 40 మంది పట్టణ వీధుల్లో నినాదాలు చేస్తూ మునిసిపల్ గ్రౌండ్ నుండి తిమ్మారెడ్డి బస్టాప్ వరకు సైకిల్ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఎన్‌సిసి డే సందర్భంగా బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను సందర్శించారు. ట్యాంక్ దగ్గర ఉన్న చెత్తని తొలగించారు. క్యాడెట్ శివరాం మాట్లాడుతూ మన పరిసరాలలో ఉన్న నీటి వనరులను కాపాడుకోవాలని కోరారు.

ఉత్తమ అవార్డు తీసుకోవడం ఆనందంగా ఉంది

ఉత్తమ అవార్డు తీసుకోవడం ఆనందంగా ఉందని ఎన్‌సిసి ఆఫీసర్ గోవిందు తెలిపారు. ఎన్సిసి డే సందర్భంగా హైదరాబాద్ మెహందీపట్నంలో జరిగిన ఎపి, తెలంగాణా రాష్ట్ర స్థాయి అవార్డుల ప్రదానం కార్యక్రమంలో ఆయన అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు శుభాకాంక్షలు

ఉత్తమ అవార్డు అందుకుంటున్న ఎన్‌సిసి ఆఫీసర్ గోవిందు (ఫైల్)

తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదోని ఆర్ట్స్ సైన్స్ కళాశాలలో ఆర్థిక శాస్త్రం లెక్చరర్, ఎన్సిసి లెఫ్టినెంట్‌గా విధులు నిర్వహిస్తున్నానన్నారు. బెస్ట్ ఎన్సీసీ ఆఫీసర్ అవార్డును, సీనియర్ డివిజన్ విభాగంలో, అసోసియేట్ ఎన్సీసీ ఆఫీసర్‌గా రెండు రాష్ట్రాల డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వి.ఎం.రెడ్డి చేతుల మీదుగా అందుకున్నామన్నారు. కార్యక్రమంలో స్కూల్ స్థాయి, పిఐ స్థాయి, బెస్ట్ యూనిట్లకు చెందిన వివిధ విభాగాలకు అవార్డులను అందజేశారు. రెండు రాష్ట్రాలకు కలిపి బెస్ట్ ఆఫీసర్ అవార్డును అందుకున్న కెప్టెన్ గోవిందు మాట్లాడుతూ ఈ అవార్డు రావడం సంతోషకరమని, తనకు అవార్డు రావడానికి సహకరించిన కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

హామీల అమలులో కూటమి పభుత్వం విఫలం

- వేదవతి ప్రాజెక్టు పూర్తిచేసి తాగు, సాగు నీరు అందించాలి

ప్రజాశక్తి- దేవనకొండ

రాష్ట్రంలో అధికారం చేపట్టిన ఎన్‌డిఎ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయడంలో విఫలమైందని, వాలంటీర్ వ్యవస్థను నిర్వీర్యం చేసిందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని వైసిపి జిల్లా కోశాధికారి, సీనియర్ నాయకులు తెర్నేకల్ కొత్తకాపు మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో పేద ప్రజలకు పలు సంక్షేమ పథకాలను అందించిందన్నారు. సామాన్య, మధ్య తరగతి, పేద ప్రజలపై ట్రూఅప్ చార్జీల పేరిట విద్యుత్ బిల్లులను పెంచి పెను భారం మోపిందన్నారు. నిత్యవసర ధరలు విపరీతంగా పెంచి రిఫండ్ ఆయిల్, మంచి నూనె ధర అమాంతంగా పెరిగి లీటరుకు రూ.160 కు చేరిందన్నారు. కరువుకు నిలయమైన పశ్చిమ ప్రాంతమైన ఆలూరు నియోజకవర్గంలో వేదవతి ప్రాజెక్టు నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించి ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, హాలహర్వి మండలాలకు సాగు, తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. దేవనకొండ మండలంలోని హంద్రీనీవా పంట కాలువల నిర్మాణాలకు నిధులను కేటాయించి కరివేముల- పాలకుర్తి, తెర్నేకల్ -పుల్లాపురం గ్రామాల మధ్యలో ఉన్న ప్రధాన కాలువ పనులు పూర్తి చేసి రైతు లకు సాగు నీరు అందించాలన్నారు. వాలంటీర్ల వ్యవస్థను నిర్వీర్యం చేసి మంత్రివర్గ సమావేశంలో రద్దు చేస్తామని ప్రకటించడం హాస్యాస్పదమన్నారు.

ఇప్పటికైనా ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి, సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు.

పాణ్యం ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నన్నూరు ముస్లింమైనార్టీ నాయకులు

ముస్లింలకు స్మశాన వాటిక ఏర్పాటు చేయాలి

ఎమ్మెల్యే గౌరు చరిత కు ముస్లిం మైనారిటీ నాయకుల వినతి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

పాణ్యం నియోజకవర్గ ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామంలో ముస్లింలకు స్మశాన వాటిక స్థలం ఏర్పాటు చేయాలని ఆ గ్రామ ముస్లిం మైనార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి నివాసంలో నన్నూరు గ్రామం ముస్లిం మైనారిటీ నాయకులు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ముస్లిం జనాభా ఎక్కువగా ఉండడంతో (ఖబరస్థాన్)స్మశాన వాటిక స్థలం సరిపోవడం లేదని నూతన (ఖబరస్థాన్) స్మశాన వాటిక స్థలాన్ని కేటాయించాలని , కాంపౌండ్ వాల్ నిర్మించాలని, ఎమ్మెల్యేను కోరారు. మండల నాయకులు విశ్వేశ్వర రెడ్డి, గ్రామ మైనారిటీ నాయకులు ఖాజామియ్యా, శంశుద్ధిన్, సర్దార్‌ఖాన్, వలిబేగ్, సర్కార్, హమీద్ బేగ్, తదితరులు పాల్గొన్నారు.

30 శాతం ఐఆర్ ప్రకటించాలి: ఎస్‌టియు

ప్రజాశక్తి - ఆదోని

ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం ఐఆర్ ప్రకటించాలని ఎస్టియు నాయకులు డిమాండ్ చేశారు. ఎస్‌టియు ఆదోని, కౌతాళం మండలాల మధ్యంతర వార్షిక కౌన్సిల్ సమావేశం ఆదివారం ఆదోనిలోని నేషనల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో జరిగింది. సమావేశానికి ఆదోని మండల అధ్యక్షుడు చింతకుంట రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఎస్‌టియు సీనియర్ నాయకులు వెంకోబా మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కావస్తున్నా ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలకు పరిష్కారం దిశగా అడుగులు వేయడం లేదని విమర్శించారు. వెంటనే 12వ పిఆర్సి లో భాగంగా పిఆర్సి కమిషనర్‌ను నియమించి వెంటనే 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కౌన్సిలర్ బి.మహదేవప్ప మాట్లాడుతూ దాదాపుగా 20 వేల కోట్లు ఉద్యోగ ఉపాధ్యాయ ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి బి.గోపాల్ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఏకీకృత సర్వీస్ రూల్స్ వెంటనే పరిష్కరించి అర్హత కలిగిన ఉపాధ్యాయులందరికీ ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి యంసి సుంకన్న మాట్లాడుతూ ఆపార్‌లోని సర్వర్ సమస్యను తొలగించి ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి బి.సుధాకర్ బాబు, జిల్లా ఆర్థిక కమిటీ సభ్యుడు బి రామాంజనేయులు , సీనియర్ నాయకులు డి చంద్రశేఖర్ ,రామాంజనేయులు రెడ్డి , కౌతాళం మండల ఆర్థిక కార్యదర్శి ఖాదర్ బాషా, ఆదోని మండల గౌరవాధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి, కౌతాళం మండల నాయకులు ఆంజనేయ, లక్ష్మన్న, కాంతారావు, సీనియర్ నాయకులు ఈరన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రికవరీ సొమ్ము బాధితులకు అప్పగింత

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

ఓ కేసులో రికవరీ చేసిన సొమ్మును బాధితులకు అప్పగించామని కర్నూలు నాలుగో పట్టణ సీఐ మధుసూదన్ గౌడ్ అన్నారు. ఆదివారం నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించి 6 తులాల బంగారు, 10 తులాల వెండి ఆభరణాలు, రూ.12 వేల నగదును బాధితులకు అందజేశారు. సిఐ మాట్లాడుతూ... ఈ నెల 21వ తేది నంద్యాల జిల్లా, సున్నిపెంట గ్రామానికి చెందిన కాత రామిరెడ్డి, అతని భార్య సున్నిపెంట నుండి కర్నూలులో ఒక వివాహ కార్యక్రమానికి హాజరై తిరిగి సున్నిపెంటకు వెళ్తూ కర్నూలు బస్టాండ్‌లో బస్సు ఎక్కగా, వారికి చెందిన ఒక బ్యాగ్ కర్నూలు బస్టాండ్‌లో మర్చిపోయి వెళ్లినట్లు, అందులో విలువైన బంగారు, వెండి ఆభరణాలు ఉన్నాయని నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. జిల్లా ఎస్పీ జి. బిందు మాదవ్ ఆదేశాల మేరకు కర్నూలు నాల్గవ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ మధుసూదన్ గౌడ్, సిబ్బందిని ప్రత్యేక బృందంగా ఏర్పాటు చేసి బస్టాండ్‌లో సిసి కెమెరాలను పరిశీలించి 3 రోజులలో ట్రేస్ చేసి

గుర్తించామన్నారు. బాధితులు కాత రామిరెడ్డిని స్టేషన్కు పిలిపించి సొమ్మును, నగదును అందజేశామన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న కర్నూలు నాల్గవ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ మధుసూదన్ గౌడ్, స్టేషన్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

కుడా చైర్మన్ కు సన్మానం

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

కర్నూలు పారిశ్రామికవేత్తల సంఘం పిరమిడ్ ఆధ్యాత్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లను ఘనంగా సన్మానించారు. స్థానిక త్రిగుణ క్లర్క్స్ హోటల్లో బివి రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, పారిశ్రామికవేత్తలు కేజేరెడ్డి, రామకృష్ణారెడ్డి, సాయిరెడ్డి, రవీంద్రవిద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య పాల్గొన్నారు. రాష్ట్ర పారిశ్రామిక రంగంలోనే కర్నూలు ముందంజలో ఉండాలని సిఎం భావిస్తున్నారని, అందుకు కుడా చైర్మన్గా పదవి సోమిశెట్టి వెంకటేశ్వర్లను నియమించారని అన్నారు. కర్నూలు అభివృద్ధికి సోమిశెట్టి కృషి చేయాలని వక్తలు పేర్కొన్నారు. రెండోసారి చైర్మన్‌గా ఎంపిక చేసినందుకు ముఖ్యమంత్రికి అభినందనలు తెలిపారు. పార్టీలో అంకితభావంతో పనిచేసిన ఆయన తన సేవలను కర్నూలు నగర అభివృద్ధికి వినియోగించాలని పారిశ్రామికవేత్తలు, పిరమిడ్ ఆధ్యాత్మిక కేంద్రం సభ్యులు పేర్కొన్నారు.

ఇచ్చిన మాటను నెరవేర్చిన ఎమ్మెల్యే బీవీ

- నందవరం కోట వీధిలో సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి - నందవరం

నందవరం కోటవీధి ప్రజలకు ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వరరెడ్డి ఇచ్చిన మాటను నెరవేర్చారు. ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే పల్లెనిద్ర కార్యక్రమాన్ని కోటవీధిలో నిర్వహించినప్పుడు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీనిచ్చారు. అందులో భాగంగానే జల్ జీవన్ మిషన్ కింద పైపులైన్లను, వీధిలో సిసి రోడ్లను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేకు ప్రజలు ధన్యవాదాలు తెలియజేశారు.

వీధిలో రోడ్లు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నాం : తెలుగు ఈరన్న

వైసిపి ప్రభుత్వం ఏర్పడక ముందు టిడిపి ప్రభుత్వ హయాంలో వీధిలో రోడ్లు వేశారు. వీధిలో నుండి బయటకు వెళ్లే ముఖద్వారం మాత్రం నిలిచిపోయింది. వాహనాలు, ఎద్దుల బండ్లు వెళ్లాలన్న ఈ మార్గంలోనే వెళ్లాలి. రోడ్డు లేక చాలా ఇబ్బందులను ఎదుర్కొన్నాం. వర్షం పడితే వీధి ప్రజలకు రవాణా నరకంలా ఉండేది. వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఐదు సంవత్సరాలు రోడ్డు వెయ్యకుండా కాలయాపన చేసింది. ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వరరెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రోడ్డును ఈరోజు వేశారు. రవాణా కష్టాలు ఈరోజుతో తీరిపోయాయి.

జల్ జీవన్ మిషన్ ప్రారంభించడం సంతోషకరం : చాకలి పంపయ్య

వీధిలో తాగునీటి కష్టాలను తీర్చడం కోసం ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వరరెడ్డి జల్ జీవన్ మిషన్ కింద పైప్ లైన్ వేయడం సంతోషకరంగా ఉంది. గత వైసిపి ప్రభుత్వం ఏర్పడక ముందు టిడిపి ప్రభుత్వం వీధిలో తాగునీటి కష్టాలను తీర్చడం కోసం వాటర్ ట్యాంకును నిర్మించింది. ఆ వాటర్ ట్యాంక్ ద్వారా ప్రజలకు నీరు అందించకుండా వైసిపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. మళ్లీ నేడు టిడిపి ప్రభుత్వ హయాంలో నాడు నిర్మించిన వాటర్ ట్యాంకు ద్వారా ప్రజల కష్టాలను తీర్చడం కోసం జల్ జీవన్ మిషన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. వీధిలో చాలావరకు పైప్ లైన్ వేశారు. త్వరలోనే ఇంటింటికి కుళాయి ఇచ్చి తాగునీటి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని ఎమ్మెల్యేని కోరారు.

శ్రీ మఠంలో రాష్ట్ర మెడికల్ చీఫ్ అడ్మినిస్ట్రేషన్ అధికారి

ప్రజాశక్తి-మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమెన మంత్రాలయంలో రాఘవేంద్రస్వామిని రాష్ట్ర మెడికల్ చీఫ్ అడ్మినిస్ట్రేషన్ అధికారి ఎ.గణపతి రావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న వారికి జిల్లా ఎఒ అరుణ, ఎన్‌హెచ్‌ఎం.శర్మ, కల్లుదేవకుంట మెడికల్ అధికారులు డాక్టర్ గోవిందమ్మ, భావన, సురేష్ స్వాగతం పలికారు.గ్రామ దేవత మంచాలమ్మను శ్రీ రాఘ వేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళహారతులు స్వీక రించారు. వారి వెంట వైద్య సిబ్బంది నీలకంఠ రాజు, పీరానాయక్ ఉన్నారు.

అభివృద్ధి పనులతోనే సర్పంచులకు విలువ

- బంటనహాల్ సర్పంచి సుశీలమ్మ

ప్రజాశక్తి - చిప్పగిరి

గ్రామాలలో అభివృద్ధి పనులు జరిగినప్పుడే సర్పంచులకు విలువ, ప్రాముఖ్యత ఉంటుందని బంటనహాల్ సర్పంచి సుశీలమ్మ తెలిపారు. ఆదివారం బంటనహాళ్ గ్రామంలో ఉపాధి నిధులు రూ.10 లక్షలు, ఎంపీపీ గ్రాంట్ రూ. 6 లక్షలు, పంచాయతీ గ్రాంట్ రూ. 2 లక్షలతో వీధులలో సిసి రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ముళ్ళ కంప చెట్లతో నిండిపోయిన స్మశానంను జెసిబి ద్వారా తొలగించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంచార్జ్ వీరభద్ర గౌడ్ సహకారంతో గ్రామంలో నిరంతరం అభివృద్ధి పనులు చేయుటకు కృషి చేస్తామన్నారు. తాగునీరు, మౌలిక సదుపాయాలకు ప్రాముఖ్యత ఇచ్చి ఏ సమస్య రాకుండా చూసుకుంటామన్నారు. సర్పంచ్ తనయుడు టిడిపి నాయకులు సురేష్, శేఖర్ గోపాల్, రామాంజనేయులు, అనిల్ పాల్గొన్నారు

నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగరపాలక కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలకు తమ కాలనీల్లో ఏవైనా స్థానిక సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయాలని కోరారు. ఉదయం 11 గంటల నుండి కార్యక్రమం ప్రారంభమవుతుందని, అర్జీ ఆధార్‌కార్డు తీసుకువచ్చి ఫిర్యాదు చేయవచ్చున్నారు. అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.